సాక్షి
బాపట్ల
బుధవారం, 13, నవంబర్, 2024



డీఆర్వోగా బాధ్యతలు చేపట్టిన మురళి


నరసరావుపేట: జిల్లా రెవెన్యూ అధికారిగా పి.మురళి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. మర్యాదపూర్వకంగా కలెక్టర్ పి.అరుణ్‌బాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



జెడ్పీని సందర్శించిన కృష్ణతేజ

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ ఎంవీఆర్ కృష్ణ తేజ మంగళవారం జెడ్పీ కార్యాలయాన్ని సందర్శించారు.

వెండి సర్వాభరణాలు విరాళం



నరసరావుపేట ఈస్ట్: రావిపాడురోడ్డు బాలయ్య నగర్‌లోని కల్యాణ సుందరేశ్వరస్వామి ఆలయ పార్వతీ అమ్మ వారికి రూ.7లక్షల విలువైన వెండి సర్వాభరణాలను పట్టణానికి చెందిన భడభాగ్ని శ్రీనివాస రావు, భువనేశ్వరి దంపతులు అందజేశారు.

కరకట్ట డొల్ల.. బలోపేతం కల్ల!

- పలుచోట్ల బలహీనంగా మారిన కృష్ణా కరకట్ట
- వరదల సమయంలో ప్రజలకు కోతల భయం
- పటిష్ట పరచడానికి సర్కారు చర్యలు శూన్యం

కృష్ణా వరదలకు అడ్డుగోడగా నిలవాల్సిన కరకట్ట బలహీనంగా తయారై ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. వరదల సమయంలో కృష్ణా పరివాహక ప్రాంతానికి ఎగువన ఉన్న ప్రాంతాలకు రక్షణగా దీన్ని ఏర్పాటు చేసినా పటిష్టత లేక ప్రజలపాలిట శాపంగా మారింది. వరద విపత్తు ముంచుకొచ్చిన సమయంలో కరకట్ట కోతలను అడ్డుకునేందుకు ప్రజలు రేయింబవళ్లు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కరకట్టను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం వరదల సమయంలో మాత్రమే యంత్రాంగాన్ని ఉరుకులు పరుగులు పెట్టించడం మినహా ఎలాంటి జాగ్రత్తలూ తీసుకోవడం లేదు.

కొల్లూరు: కృష్ణా నది కరకట్ట పటిష్టతకు సర్కారు చర్యలు చేపట్టకపోవడం దాని మనుగడనే ప్రశ్నార్థకంగా మార్చింది. కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలో సుమారు 40 కిలోమీటర్లకు పైగా ఉన్న కరకట్ట గత వరదలకు పలు ప్రాంతాలలో బలహీన పడింది. ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేసింది. కొల్లూరు మండలం చిలుమూరు నుంచి జిల్లాలో ఆరంభమయ్యే కరకట్ట.. రేపల్లె మండలం పెనుమూడి వరకు అనేక ప్రాంతాలలో బలహీనంగా మారింది. భవిష్యత్తులో ప్రాణ, ఆస్తి, పంట నష్టాలకు గురవుతామన్న ఆందోళన ప్రజలలో నెలకొంది.

అనుభవాలతో నేర్వని పాఠాలు

కృష్ణా కుడి కరకట్టను పటిష్ట పరిచే విషయంలో గత అనుభావాలను దృష్టిలో ఉంచుకొని స్పందించాల్సిన ప్రభుత్వం పాఠాలు నేర్వలేదు. 2009 వరదల సమయంలో భట్టిప్రోలు మండలం ఓలేరు సమీపంలో కరకట్టకు గండి పడి రేపల్లె పట్టణంతోపాటు అనేక గ్రామాలు ముంపుకు గురయ్యాయి. తీవ్ర పంట, ఆస్తి నష్టం జరిగింది. అనంతరం కరకట్ట పటిష్టత పనులు చేపట్టారు. కానీ కరకట్ట మళ్లీ బలహీన పడింది. రైతులు కోర్టులకు వెళ్లడం కారణంగా కొన్ని ప్రాంతాలలో అభివృద్ధి పనులు నిలిచి పోయాయి. వరదల వేళ ప్రజలే కరకట్ట పొడవునా తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. రెండు నెలల క్రితం సంభవించిన వరదల సమయంలో పెదపులివర్రు, చాట్రగడ్డ, పల్లెపాలెం, రావిఅనంత వరం, పెదపులివర్రు, దోనేపూడి, కోటిపల్లి, వెల్లటూరు ప్రాంతాలలో నీరు లీకైంది. ప్రజలు ఆందోళనకు గురయ్యారు. స్థానికులు, అధికారులు రాత్రింబవళ్లు ఇసుక మూటలు, మట్టి వేశారు. అతికష్టం మీద కరకట్ట తెగకుండా ప్రాణాలకు తెగించి శ్రమించారు.

అక్రమ తవ్వకాలు, పైపులతో ముప్పు

కరకట్ట అంచుల వరకు నిబంధనలను అతిక్రమించి చేపడుతున్న మట్టి తవ్వకాలు, కరకట్ట లోపలి నుంచి సాగు నీటి పైపుల ఏర్పాటుతో ముప్పు పొంచి ఉంటోంది. కరకట్ట అంచులను తవ్వి సేద్యానికి అనువుగా మార్చడం, ఇటుక బట్టీల నిర్వాహకులు నిబంధనలను అతిక్రమించడంతో ప్రజల ప్రాణాలను పణంగా పెట్టాల్సి వస్తోంది. పశ్చిమ బ్యాంక్ కెనాల్ నుంచి అనధికారికంగా కరకట్ట మధ్య నుంచి సాగునీటి పైపులు ఏర్పాటు చేయడంతో దాని మనుగడకు పెనుముప్పుగా మారింది. కృష్ణా నదికి తరచుగా భారీ వరదలు సంభవిస్తుండటంతో ఇప్పటికైనా ప్రభుత్వం కరకట్టను బలోపేతం చేయడంపై దృష్టి సారించాలని ప్రజలు అభిప్రాయ పడతున్నారు.



కొల్లూరు-ఈపూరు మధ్య కరకట్ట వద్ద వేసిన ఇసుక మూటలు జారిపోయిన దృశ్యం



దోనేపూడి-కోటిపల్లి మధ్య కరకట్ట దుస్థితి

బడ్జెట్‌లో దళితులకు ప్రాధాన్యమేదీ?

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు



సునీల్

చినగంజాం: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీ తప్ప మరొకటి కాదని మాల మహానాడు బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేడికొండ సునీల్ విమర్శించారు. ఎస్సీ,ఎస్టీలకు కనీస ప్రాధాన్యం కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. మంగళవారు ఈ మేరకు ఓ ప్రకటనలో తెలిపారు. బడ్జెట్‌లో ఎస్సీ కాంపోనెంట్‌కు సంబంధించిన అంచనా రూ.18,487 కోట్లు కేటాయించినట్లు చూపారని అన్నారు. గత ప్రభుత్వం అమలు చేయని 29 ఎస్సీ పథకాలను అధికారంలోకి వచ్చిన వెంటనే పునరుద్ధరిస్తామని చెప్పిన కూటమి నేతలు ఇప్పుడు బడ్జెట్‌లో ఆ ప్రస్తావన తీసుకురాలేదని అన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టానికి సంబంధించి కేంద్రం ఇచ్చే నిధులతో సర్దుబాటు చేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నయాపైసా కూడా కేటాయించలేదని పేర్కొన్నారు. చంద్రన్న పెళ్లికానుకకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. బాలింతలు, పసిబిడ్డల్లో పోషకాహార లోపాలు లేకుండా చేయడానికి నిధులు పెంచాల్సి ఉందన్నారు. కానీ దీనికి బదులు తగ్గించటం సరైన విధానం కాదన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించి రుణాలు, భూమి కొనుగోలు పథకం గురించి ప్రస్తావన ఎక్కడా కనిపించలేదని అన్నారు. రాష్ట్రంలో 17 శాతం దళితులు ఉన్నా వారికి తగినట్లు బడ్జెట్‌లో నిధులు కేటాయించక పోవడం సరికాదన్నారు. ఇది దళితుల హక్కులను కాలరాయడమే అని పేర్కొన్నారు. రాజ్యాంగం దళిత గిరిజనులకు కల్పించిన హక్కులను కాపాడుకోవడం కోసం న్యాయ పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు.

సాగు ఆదాయం మరింత పెరగాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

బాపట్ల: జిల్లాలో పంటల విస్తీర్ణం, దిగుబడులు పెంచి సాగు ఆదాయం మరింత వృద్ధి చెందేలా చూడాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్షించిన అంశాల పురోగతిపై వివిధ శాఖల జిల్లా అధికారులతో ఆయన మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. రైతులకు అవగాహన కల్పించి ప్రకృతి వ్యవసాయాన్ని మరింత పెంచాలని ఆయన చెప్పారు. ప్రోటీన్ రైస్ , చిరుధాన్యాలు, పండ్ల ఉత్పత్తి, సూక్ష్మసేద్యం పెంచేలా చూడాలన్నారు. పంటలకు గిట్టుబాటు ధర లభించేలా ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. ధాన్యం సేకరణలో ఇతరుల జోక్యం ఉంటే సహించేది లేదని హెచ్చరించారు. పశు సంపద పెంచేలా సంబంధిత వైద్యులు కృషి చేయాలన్నారు. కల్తీ పాల విక్రయాలను అరికట్టాలని సూచించారు. సముద్ర తీరం వెంబడి పెరిగే మొక్కలను ఉపాధి హామీ పథకంతో అనుసంధానం ద్వారా నాటడాన్ని పదిహేను రోజుల్లో పూర్తి చేయాలని చెప్పారు. ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు. పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలన్నింటిలో సౌర విద్యుత్ వినియోగించాలని, విరివిగా సోలార్ యూనిట్లను మంజూరు చేయాలని పేర్కొన్నారు. గుంతల రహిత రహదారుల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.17.32 కోట్లు విడుదల చేసిందన్నారు. విద్యాశాఖ, సర్వ శిక్ష అభియాన్ ఆధ్వర్యంలోని బడులు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని చెప్పారు. వసతి గృహాలకు మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. వీటిని సచివాలయాలకు అనుసంధానిస్తామని చెప్పారు. ప్రభుత్వ వైద్యశాలల్లో సేవలు మెరుగు పరచాలని అధికారులను ఆదేశించారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పలు సూచనలు చేశారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీడీ ప్రోగ్రాం జాగ్రత్తగా నిర్వహించాలి

క్యాన్సర్ నివారణపై రూపొందించిన ప్రచార గోడ పత్రాలను కలెక్టర్ విడుదల చేశారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ నుంచి చేపట్టిన ఎన్‌సీడీ ప్రోగ్రాం కింద ప్రతి కుటుంబంలో 18 సంవత్సరాలు నిండిన వారికి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. వివరాలు యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ ప్రఖర్ జైన్, డీఎంహెచ్‌ఓ డాక్టరు ఎస్.విజయమ్మ, డాక్టరు శేషుకుమార్, డాక్టరు టి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

23న జెడ్పీ సర్వసభ్య సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జెడ్పీ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 23న ఉదయం 10.30 గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన నిర్వహించనున్నట్లు సీఈవో వి.జ్యోతిబసు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 20న సమావేశాన్ని నిర్వహించాల్సి ఉండగా, బడ్జెట్ సమావేశాల దృష్ట్యా 23వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు.

ఇద్దర్ని బలిగొన్న కంటైనర్

- ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టిన కంటైనర్
- డ్రైవర్ అక్కడికక్కడే మృత్యువాత
- చికిత్స పొందుతూ మరొకరు మృతి
- మరో తొమ్మిది మందికి తీవ్ర గాయాలు
- ఏరియా వైద్యశాలలో మిన్నంటిన కుటుంబసభ్యుల రోదనలు



వెంకటేశ్వర్లు మృతదేహం



(ఫైల్)



ఘటనా స్థలిలో ఆటోలో ఇరుక్కుపోయిన హరీష్

(ఫైల్)

బాపట్ల టౌన్: ఎమ్మెల్యేకు చెందిన కంపెనీ కంటైనర్.. రెండు నిండు ప్రాణాలను బలిగొంది. ఆగి ఉన్న ఆటోను కంటైనర్ ఢీకొట్టిన ఘటన కర్లపాలెం మండలం, బుద్దాం గ్రామం సమీపంలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా... మరో 9 మందికి గాయాలయ్యాయి. కర్లపాలెం మండల కేంద్రానికి చెందిన బాలిగా హరీష్ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం కర్లపాలెం నుంచి చెరుకుపల్లి వైపు వెళ్తున్నాడు. బుద్దాం సమీపంలో ప్రయాణికురాలి నుంచి డబ్బులు తీసుకునేందుకు ఆటోను రోడ్డు మార్జిన్‌లో నిలిపాడు. అదే సమయంలో స్థానిక ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రొయ్యల కంపెనీ (రాయల్ మెరైన్)కు చెందిన కంటైనర్ చందోలు నుంచి కర్లపాలెం వైపు వస్తోంది. బుద్దాం సమీపంలోకి రాగానే డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా కంటైనర్ యూటర్న్ తీసుకొని ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ హరీష్ (27) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న హరీష్ మిత్రుడైన దేవరకొండ వెంకటేశ్వర్లు (35), ప్రయాణికులు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు అప్రమత్తమై వారిని చికిత్స నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలంలో తీవ్ర గాయాలపాలైన వెంకటేశ్వర్లును కూడా చికిత్స నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. అప్పటికే క్షతగాత్రుడికి రెండు కాళ్లు, పక్కటెముకలు విరిగాయి. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు తరలించారు. గుంటూరు జీజీహెచ్‌కు వెళ్లేలోగానే మృతి చెందాడు. హరీష్, వెంకటేశ్వర్లు స్నేహితులు. వీరి భార్యలు భావన, జయశ్రీలు బంధువులే. వెంకటేశ్వర్లు లారీ డ్రైవర్. బాడుగ లేని సమయంలో ఇద్దరు కలిసి ఆటో నడుపుతుంటారు. ఆటో ఎక్కిన ప్రయాణికులు అనూహ్యంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యారు. వారిలో మద్దిబోయిన శ్రీనివాసరావు (బుద్దాం), బి. సురేష్ (కర్లపాలెం), బెజ్జం ఇందిర (ఖాజీపాలెం), రెడ్డిపాలెం సమీపంలోని చాయిస్ రొయ్యల కంపెనీలో విధులు నిర్వర్తించే మెనకా మజార్, ఆకాష్, ప్రశాంత్ కౌర్, నిస్సీ, ఉమామాలీ, రోబిన్ కుమారి ఉన్నారు. వీరికి తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. మృతుల కుటుంబసభ్యులు, బంధువులతోపాటు క్షతగాత్రుల సంబంధికుల రోదనలు మిన్నంటాయి. రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న కర్లపాలెం తహసీల్దారు సుందరమ్మ వైద్యశాలకు చేరుకున్నారు. మృతుల కుటుంబసభ్యులతో మాట్లాడారు. క్షతగాత్రులను పరామర్శించారు. ఎస్ఐ ఎ.రవీంద్ర ఘటనా స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.



క్షతగాత్రులకు వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

పత్తాలేని ప్రభుత్వ అంబులెన్స్

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలై కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న వెంకటేశ్వర్లుకు సకాలంలో వైద్యసేవలు అందలేదు. పాలకుల నిర్లక్ష్యం...అధికారుల అలసత్వం కారణంగానే వెంకటేశ్వర్లు మృతి చెందాడు. మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రమాదం జరిగితే సాయంత్రం 5 గంటల వరకు క్షతగాత్రుడిని బాపట్ల ఏరియా వైద్యశాలలోనే ఉంచారు. అప్పటికీ అంబులెన్స్‌కు ఫోన్ చేస్తే ఇంకా గంట సమయం పడుతుందని చెప్పడంతో ఆగ్రహించిన క్షతగాత్రుడి బంధువులు 'ఇదేం దిక్కుమాలిన ప్రభుత్వం... ఓ వైపు ప్రాణాలు పోతున్నా అంబులెన్స్‌లు అందుబాటులో లేకపోవడం ఏంటి?' అంటూ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటు అంబులెన్స్‌ను ఆశ్రయించారు. అప్పటికీ మరో అరగంట ఆలస్యం అయింది. మొత్తంగా సుమారు 5 గంటలకుపైగా సమయం గడిచిపోవడంతో వెంకటేశ్వర్లు మృతి చెందాడని ఆయన కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.